


వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ ఎం. సుధీర్‌కుమార్‌కు బీ ఫాం అందజేస్తున్న పార్టీ అధినేత కేసీఆర్, చిత్రంలో ఎమ్మెల్సీలు సిరికొండ, బస్వరాజు, బండా, మాజీ ఎమ్మెల్యేలు




మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవితకు బీ ఫాంను అందజేస్తున్న కేసీఆర్, చిత్రంలో ఎమ్మెల్సీలు సత్యవతి, తక్కళ్లపల్లి, మాజీ ఎమ్మెల్యే

# బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థులకు బీ ఫాంలు

## అందజేసిన పార్టీ అధినేత కేసీఆర్




కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌కు బీ ఫాంను అందజేస్తున్న కేసీఆర్, చిత్రంలో కేటీఆర్ తదితరులు

**స్వీకరించిన వరంగల్, మహబూబాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, భువనగిరి ఎంపీ అభ్యర్థులు**

**పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేసిన గులాబీ బాస్**




కేసీఆర్ చేతుల మీదుగా బీ-ఫాం అందుకుంటున్న భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశం, చిత్రంలో ఎమ్మెల్సీలు పల్లా, యెగ్గె మల్లేశం తదితరులు




బీ-ఫాం అందుకుంటున్న బీఆర్‌ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

హనుమకొండ/మహబూబాబాద్ రూరల్/జనగామ, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థులకు అధినేత కేసీఆర్ గురువారం బీఫాంలు అందజేశారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో గురువారం పార్టీ శ్రేణులు, బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థులతో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. అనంతరం వరంగల్, మహబూబాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, భువనగిరి పార్లమెంట్ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులు డాక్టర్ మారెపల్లి సుధీర్ కుమార్, మాలోత్ కవిత, బోయినపల్లి వినోద్‌కుమార్, కొప్పుల ఈశ్వర్, క్యామ మల్లేశ్ కేసీఆర్ చేతుల మీదుగా బీ ఫాం అందుకున్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయాలని అన్నారు. ఎన్నికలు ఏవైనా ఎగిరేది గులాబీ జెండానేనని అన్నారు. ఎవరూ అధైర్యపడాల్సిన పనిలేదన్నారు. పార్లమెంట్ పరిధిలోని బీఆర్‌ఎస్ పార్టీ ప్రతినిధులు, శ్రేణులు, కార్యకర్తలు అందరూ కష్టపడి సమన్వయంతో పనిచేస్తే గెలుపు ఖాయమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీపై వస్తున్న వ్యతిరేకత, ఇచ్చిన హామీల విషయంలో రాష్ట్రప్రభుత్వం విఫలమైందని, అలాగే గత పది సంవత్సరాల కాలంలో బీజేపీ తెలంగాణ రాష్ట్రానికి ఏమీ చేయలేదనే అంశాలతో పాటు బీఆర్‌ఎస్ పార్టీ చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేసీఆర్ సూచించారు. కార్యక్రమంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీలు సత్యవతిరాథోడ్, సిరికొండ మధుసూదనాచారి, బస్వరాజు సారయ్య, యెగ్గె మల్లేశం, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, గండ్ర వెంకటరమణారెడ్డి, చల్లా ధర్మారెడ్డి, నన్నపునేని నరేందర్, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, రెడ్యానాయక్, బానోత్ శంకర్‌నాయక్, హరిప్రియ, గొంగిడి సునీత, వరంగల్, మహబూబాబాద్ జడ్పీ చైర్‌పర్సన్లు గండ్ర జ్యోతి, అంగోత్ బిందు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు మెట్టు శ్రీనివాస్, లింగంపల్లి కిషన్‌రావు, ఏనుగుల రాకేశ్‌రెడ్డి, కుడిది మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆర్వో ప్రవీణకు నామినేషన్ అందజేస్తున్న పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి తౌటపల్లి నర్మద

# నామినేషన్లు షురూ..

**తొలి రోజు వరంగల్‌లో మూడు, మహబూబాబాద్‌లో ఒకటి దాఖలు**

**ఏడీఆర్, పీపీవోఐ పార్టీలతో పాటు ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు**

*పార్లమెంట్ ఎన్నికలకు నామినేషన్ల పర్వం మొదలైంది. గురువారం తొలి రోజు వరంగల్‌లో మూడు, మహబూబాబాద్‌లో ఒకటి దాఖలయ్యాయి. వరంగల్ నియోజకవర్గం నుంచి అలయెన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ నుంచి ఒకరు, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి ఒకరు, స్వతంత్ర అభ్యర్థిగా ఒకరు, మహబూబాబాద్ నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా ఒకరు నామినేషన్ దాఖలు చేశారు. ఆయా ఆర్వో కార్యాలయాల్లో రిటర్నింగ్ అధికారులు పీ ప్రావీణ్య, అద్వైత్‌కుమార్ నామినేషన్లను స్వీకరించారు.*

*- వరంగల్/మహబూబాబాద్, ఏప్రిల్ 18 (నమస్తేతెలంగాణ)*



వరంగల్ ఆర్వో కార్యాలయం వద్ద పోలీసుల బందోబస్తు

పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతో గురువారం నుంచి నామినేషన్ల దాఖలు ఘట్టం మొదలైంది. ఎస్సీలకు రిజర్వ్ చేసిన వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి అలయెన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ అభ్యర్థిగా అంబోజు బుద్దయ, స్వతంత్ర అభ్యర్థిగా బరిగెల శివ, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా తౌటపల్లి నర్మద తమ నామినేషన్లను దాఖలు చేశారు. ప్రతిపాదిత, బలపరిచిన వ్యక్తులతో కలిసి ఒక్కో సెట్‌ను నామినేషన్ పత్రాలను వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లోని ఆర్వో కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి ప్రావీణ్యకు అందజేశారు. ఎన్నికల వ్యయపరిశీలకులు ధీరజ్ సింగ్ ఆర్వో కార్యాలయాన్ని సందర్శించి నామినేషన్ల దాఖలు, ఏర్పాట్లను పరిశీలించారు. ఆర్వో ప్రావీణ్య కలెక్టరేట్‌లో ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎన్నికల అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. హనుమకొండ ఏసీపీ కొత్త దేవేందర్‌రెడ్డి తమ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, ఇతర సిబ్బందితో కలిసి బందోబస్తును పర్యవేక్షించారు. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల నోటిఫికేషన్‌ను రిటర్నింగ్ అధికారి అద్వైత్‌కుమార్ సింగ్ గురువారం ఉదయం 10.30 గంటలకు విడుదల చేశారు. 11 గంటల నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభించారు. మహబూబాబాద్ పార్లమెంట్ స్థానానికి మరిపెడ మండలం ఎడ్జెర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని గుర్రప్పతండాకు చెందిన బానోత్ లింగ్యా నాయక్ ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఈనెల 19న కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్, 22న బీజేపీ అభ్యర్థి సీతారాంనాయక్, 23న బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి మాలోత్ కవిత నామినేషన్ దాఖలు చేయనున్నారు. నామినేషన్ల స్వీకరణ ఈ నెల 25 వరకు కొనసాగనుంది.




మహబూబాబాద్ పార్లమెంట్ స్థానానికి నామినేషన్ దాఖలు చేస్తున్న లింగ్యా నాయక్




ఒప్పంద పత్రాలతో కేయూ, ట్రస్ట్ ప్రతినిధులు

## హార్ట్‌ఫుల్‌నెస్ ఎడ్యుకేషనల్‌తో కేయూ ఒప్పందం

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 18 : హైదరాబాద్‌కు చెందిన హార్ట్‌ఫుల్‌నెస్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కేయూతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి, హార్ట్‌ఫుల్‌నెస్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ తరఫున విశ్రాంత ఐపీఎస్ ఆఫీసర్ ఆదిత్య ఆర్య, అనంత మాధవమోహన్, మురళీధర్‌రావు, ఎస్‌వీ రమణన్, వరప్రసాద్, శారద అవగాహన ఒప్పందాలు మార్చుకున్నారు. కార్యక్రమంలో వాసుదేవరెడ్డి, రామచంద్రం, నరసింహాచారి, ప్రసాద్, కోలా శంకర్ పాల్గొన్నారు.

# మావోయిస్టు మృతదేహం గుర్తింపు

**శంకర్‌రావుగా తేల్చిన కుటుంబసభ్యులు**

**ఛత్తీస్‌గఢ్ నుంచి స్వగ్రామానికి పార్థివదేహం తరలింపు**



శంకర్‌రావు(ఫైల్)

చిట్యాల, ఏప్రిల్ 18: ఛత్తీస్‌గఢ్ అడవుల్లో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన 29 మంది మావోయిస్టుల్లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగె గ్రామానికి చెందిన సిరిపెల్లి సుధాకర్ అలియాస్ శంకర్‌రావు ఉన్నట్లు ఆయన కుటుంబసభ్యులు గుర్తించారు. ఘటనా స్థలానికి గురువారం మధ్యాహ్నం చేరుకున్న వారు మృతదేహాన్ని పరిశీలించి సిరిపెల్లి సుధాకర్‌గా ధ్రువీకరించారు. ఆయన భార్య సుమన అలియాస్ రజిత కూడా మృతి చెందగా, సరైన ఆధారాలు లేక ఆమె మృతదేహాన్ని వీరికి అప్పగించడానికి పోలీసులు నిరాకరించినట్లు తెలిసింది. గురువారం అర్ధరాత్రి శంకర్‌రావు మృతదేహం చల్లగరిగె గ్రామానికి వస్తుందని, శుక్రవారం అంత్యక్రియలు జరుపనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

**శంకర్‌రావు కుటుంబ నేపథ్యం..**

చల్లగరిగె గ్రామానికి చెందిన సిరిపెల్లి ఓదెలు-రాజపోచమ్మ దంపతుల కుమారుడు సుధాకర్ స్థానికంగా 9వ తరగతి చదువుతున్న క్రమంలో తన చిన్నమ్మ కుమారుడు కలికోట శంకర్‌తో కలిసి పీపుల్స్‌వార్ పార్టీలో సానుభూతిపరుడిగా పనిచేసి 2000 సంవత్సరంలో అజ్ఞాతంలోకి వెళ్లాడు. సుధాకర్ తండ్రి ఓదెలు 15 యేళ్ల కిందట మృతి చెందాడు. సుధాకర్ ఉమ్మడి అదిలాబాద్‌కు చెందిన సుమన అలియాస్ రజితను వివాహం చేసుకోగా, ఎన్‌కౌంటర్‌లో భార్యాభర్తలు మృతి చెందడంతో రాజపోషమ్మ, కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. 22 ఏళ్ల సుదీర్ఘంగా మావోయిస్టు నేతగా ఎదిగి మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. శంకర్‌రావు మృతితో చల్లగరిగె ఉద్యమకారుల ప్రస్థానం ముగిసింది 1990 దశకంలో పోషాల తిరుపతి, మహేశ్, కలికోట శంకర్ విప్లవకార్ల ఉద్యమంలో అసువులు బాశారు. అదే గ్రామానికి చెందిన రౌతు విజేందర్ అలియాస్ శ్రీనివాస్ ఛత్తీస్‌గఢ్‌లో జిల్లా నాయకుడిగా పనిచేస్తూ 2019 ఎన్‌కౌంటర్లో మృతి చెందాడు.

## పక్షం రోజుల్లో నేలకొరిగిన ఇద్దరు

**రెండు ఎన్‌కౌంటర్లు కాంకేర్ అడవుల్లోనే..**

జయశంకర్ భూపాలపల్లి, ఏప్రిల్ 18(నమస్తే తెలంగాణ): ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ రీజియన్‌లోని కాంకేర్ జిల్లా అడవుల్లో గడిచిన పదిహేను రోజుల్లో జరిగిన రెండు ఎన్‌కౌంటర్లలో ఇద్దరు మావోయిస్టు నేతలు నేలకొరిగారు. ఇద్దరూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా వాసులే. పార్టీలో అంచెలంచెలుగా ఎదిగి ఎన్‌కౌంటర్లలో నేలకొరిగారు. ఈ నెల 6న జరిగిన ఎన్ కౌంటర్‌లో దండకారుణ్యం జోనల్ కమిటీ సెకండ్ సీఆర్‌సీ (సెంట్రల్ రీజినల్ కమిటీ)కమాండర్ అన్నె సంతోష్ అలియాస్ సాగర్ అలియాస్ శ్రీధర్ మృతి చెందాడు. ఈయన కాటారం మండలం అంకుశాపురం గ్రామానికి చెందిన వాడు. 20 ఏళ్ల క్రితమే అజ్ఞాతంలోకి వెళ్లి మావోయిస్టు పార్టీలో కీలక నేతగా ఎదిగాడు. అలాగే మంగళవారం రాత్రి జరిగిన ఎన్‌కౌంటర్‌లో చిట్యాల మండలం చల్లగరిగె గ్రామానికి చెందిన సిరిపెల్లి సుధాకర్, అతని భార్య సుమన మృతి చెందారు. అలాగే ఈ ఎన్‌కౌంటర్‌లో చిట్యాల మండలం రామచంద్రాపురానికి చెందిన దళ సభ్యుడు రాజు సైతం మృతి చెందినట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటి వరకు పోలీసులు ధ్రువీకరించడం లేదు. భూపాలపల్లి జిల్లాకు చెందిన ఇద్దరు మావో కీలక నేతలు ఒకే ప్రాంతంలో వేర్వేరు ఎన్‌కౌంటర్లలో మృతి చెందారు. కాగా నక్సల్స్ ప్రతీకార దాడులకు పాల్పడే అవకాశాలున్నట్లు భావించిన పోలీసులు అప్రమత్తమయ్యారు. సరిహద్దుల్లో ప్రత్యేక నిఘా పెట్టారు.



పార్టీలో చేరిన వారికి గులాబీ కండువా కప్పుతున్న మాజీ ఎమ్మెల్యే చల్లా

## ప్రజా పాలనను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం

**మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి**

**కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక**

పరకాల, ఏప్రిల్ 18 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనను గాలికి వదిలేసిందని, పార్టీ కార్యకర్తలను వంచిస్తున్నదని, అందుకే వారు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి చల్లా గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందన్నారు. రేవంత్ రెడ్డి 420 హామీలను అమలు చేయకుండా పాలనను పక్కదారి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రేవంత్ పాలనలో ప్రజలకు కష్టాలు తప్పడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో మాదిగలకు అన్యాయం జరుగుతున్నదని, మాదిగలకు అండగా నిలిచిన ప్రభుత్వం బీఆర్‌ఎస్ అని అన్నారు. కాగా. బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని, అధికార పార్టీ ఆగడాలను ఎప్పటికప్పుడు ఎదుర్కొని ప్రజలకు అండగా నిలుస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు చింతిరెడ్డి మధుసూదన్ రెడ్డి, మండల సమన్వయ కమిటీ సభ్యుడు ఆముదాలపల్లి అశోక్, గ్రామ అధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

**మాదిగలను కాంగ్రెస్ మోసం చేసింది..**

మాదిగ సామాజిక వర్గాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ కార్యకర్తలు మంగళపల్లి రాజ య్య, మంగళపల్లి కుమారస్వామి, మంగళపల్లి రమేశ్, మంగళపల్లి నగేశ్ అన్నారు. మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. వంద రోజుల పాలన పూర్తయినా ప్రజలకు ఎలాంటి లబ్ధి చేకూరలేదన్నారు. సాగు నీరందక పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని, మోటర్ల ద్వారా నీటిని అందిద్దామంటే కరెంటు ఉండడం లేదన్నారు. మళ్లా కేసీఆర్ ప్రభుత్వం వస్తేనే ప్రజలు సంతోషంగా ఉంటారన్నారు.

# కిలేడీ అరెస్టు

**అమాయకులను మోసం చేస్తున్న మహిళ**

**ఎంజీఎంలో అటెండెంట్ల వద్ద రూ. 6,60,000 సొత్తు చోరీ**

**ఏసీపీ నందిరాంనాయక్ వెల్లడి**

**ఆమెకు సహకరించిన మరో ఇద్దరు కూడా..**

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 18: వరంగల్ ఎంజీఎం దవాఖానలో చికిత్స కోసం వచ్చిన రోగి సహాయకులకు మాయ మాటలు చెప్పి బంగారం, నగదును దోచుకుంటున్న మహిళతోపాటు మరో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ. 6,60,000 విలువైన సొత్తును సీసీఎస్, మట్టెవాడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను వరంగల్ ఏసీపీ బి.నందిరాం నాయక్ గురువారం మట్టెవాడ పోలీసు కార్యాలయంలో వెల్లడించారు. ములుగు జిల్లా బండారుపల్లికి చెందిన చుంచు స్వప్న అలియాస్ సానియా వరంగల్ కాశీబుగ్గలో నివాసముంటున్నది. జల్సాలకు అలవాటు పడిన ఆమె సులభంగా డబ్బు సంపాదించాలనే దురుద్దేశంతో అమాయకులను ఎంచుకుంది. ఈ నేపథ్యంలో ఎంజీఎం దవాఖానలో చికిత్స కోసం వచ్చే మహిళలు, వృద్ధులను లక్ష్యంగా పెట్టుకుని మోసం చేయడానికి ప్రణాళిక సిద్ధం చేసుకుంది. ముస్లిం మహిళగా బుర్ఖా వేసుకుని రోజూ ఎంజీఎం దవాఖానలోని వార్డుల్లోకి వెళ్లి, పేషెంట్ల వద్ద ఉంటున్న కుటుంబ సభ్యుల వివరాలు సేకరిస్తూ వారిని బుట్టలో వేసుకునేందుకు ప్రణాళిక వేసుకుంది. మీకు సర్కారు నుంచి లోన్లు ఇప్పిస్తానంటూ నమ్మించి దవాఖాన బయటకు వారిని తీసుకెళ్లేది. ముందుగా మీరు మీసేవ సెంటర్ వద్ద ఫొటో దిగాల్సి ఉంటున్నందని చెబుతుండేది. ఈ సమయంలో మీ ఒంటిపై బంగారు వస్తువులు ఉంటే మిమ్మల్ని పేదవారిగా గుర్తించరని చెబుతూ నమ్మకం కల్పిస్తుంది. దీంతో వారు ఒంటిపై ఉన్న బంగారు వస్తువులను ఆమెకు ఇచ్చిన తర్వాత బాండ్ పేపర్ తీసుకొస్తానని చెప్పి ఉడాయిస్తుంది. ఈ బంగారు ఆభరణాలను అమ్ముకొని తన అవసరాలను తీర్చుకుంటూ విలాసవంతమైన జీవితం గడుపుతున్నది.

**నిందితురాలి గత చరిత్ర..**

పదేళ్ల క్రితం స్వప్నపై ములుగు పీఎస్‌లో రాబరి కేసు నమోదైంది. అలాగే, లోన్లు ఇప్పిస్తానని నమ్మించి మహిళల నుంచి బంగారం దొంగిలించిన విషయమై 2023లో హనుమకొండ, ములుగు పీఎస్‌ల్లో కేసులు నమోదై అరెస్టు అయి, జైలుకు వెళ్లి వచ్చింది. ఆరు నెలల క్రితం స్వప్న మొదటి భర్త ఫిరోజ్ ఆటోనగర్ చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందాడు. అనంతరం అతడి స్నేహితుడైన ఖాజాపాషాను మూడు నెలల క్రితం పెళ్లి చేసుకుంది. ఈ క్రమంలో ఇద్దరు కలిసి దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు.

**ఎంజీఎంలో చేసిన నేరాల చిట్టా..**

గత ఫిబ్రవరి 25న స్వప్న భర్త ఖాజాపాషా ఎంజీఎం దవాఖానకు వచ్చి పేషెంటు వద్ద ఉన్న ఓ మహిళకు మాయ మాటలు చెప్పి ఆమెను గోపాలస్వామి గుడి వద్దకు తీసుకెళ్లి బెదిరించి ఒంటిపై ఉన్న జత బంగారు కమ్మలు, రెండు పుస్తెలు, రూ. వేయి నగదును దోచుకున్నాడు. మార్చి 7న ఎంజీఎం దవాఖానకు వచ్చిన ఓ మహిళను వీరిద్దరు బెదిరించి జత చెవి కమ్మలు, నోకియా కీ ప్యాడ్, సెల్‌ఫోన్, రూ. 500 దోచుకున్నారు. 26న కూడా ఎంజీఎం ఆసుప్రతిలో ఓ మహిళకు లోన్ ఇప్పిస్తానని మాయమాటలతో నమ్మించి, ఆమె నుంచి రెండు బంగారు పుస్తెలు, గుండ్లు తీసుకున్నారు. ఇదే క్రమంలో వీరు ఆటోనగర్‌లో అద్దె ఇల్లు తీసుకుని రెండు రోజులు నివాసముండి, అక్కడ ఇంటి యాజమానికి లోన్లు ఇప్పిస్తానని నమ్మించి, అతడి నుంచి బంగారు ఉంగరం దొంగిలించి పారిపోయారు. అలాగే, ఈ నెల 6న భార్యాభర్తలు కలిసి మళ్లీ ఎంజీఎం దవాఖానకు వచ్చి ఓ మహిళ నుంచి జత కమ్మలు, మూడు జతల చెవి పోగులు, రెండు పుస్తెలు, బంగారు గుండ్లు, రూ. 7 వేల నగదు దొంగిలించారు. ఈ నెల 10న ఓ మహిళను నమ్మించి ఆమె నుంచి బంగారు పుస్తెలతాడు, జత కమ్మలు దొంగిలించి, హనీఫ్ అనే మరొక వ్యక్తి ద్వారా బంగారాన్ని ముత్తూట్ ఫైనాన్స్‌లో కుదువ పెట్టి రూ. 98 వేల నగదు తీసుకున్నారు.

**వరుస దొంగతనాలతో దర్యాప్తు ముమ్మరం..**

మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో వరుస దొంగతనాలు నమోదు కావడంతో సీపీ అంబర్ కిశోర్ ఝా ఆదేశాల మేరకు డీసీపీ సెంట్రల్ బారి, అడిషనల్ డీసీపీ రవీందర్ పర్యవేక్షణలో సీసీఎస్ సీఐ అబ్బయ్య, మట్టెవాడ సీఐ తుమ్మ గోపి, సాంకేతిక పరిజ్ఞాన నిపుణుడు సల్మాన్ పాషా, సీసీఎస్, మట్టెవాడ క్రైమ్ టీమ్స్ కలిసి పక్కా సమాచారం మేరకు దొంగిలించిన బంగారాన్ని పిన్నావారి వీధిలో అమ్ముతున్న చుంచు స్వప్న అలియాస్ సానియా, ఆమె భర్త ఎండీ ఖాజాపాషాతోపాటు మరో వ్యక్తి ఎండీ హనీఫ్‌ను అదుపులో తీసుకున్నారు. వీరి నుంచి రూ. 5.80 లక్షలు విలువ చేసే బంగారు నగలు, నోకియా కీ ప్యాడ్, మొబైల్, రూ. 80,000 నగదును స్వాధీనం చేసుకున్నారు.




వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నందిరాం నాయక్

## ఆ భూమి అటవీ శాఖదే..

**సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపిన డీఎఫ్‌వో**

భూపాలపల్లి రూరల్, ఏప్రిల్ 18: భూపాలపల్లి పట్టణంలోని కొంపల్లి గ్రామ శివారు సర్వే నంబర్ 171లో గల 106.34 ఎకరాల భూమి అటవీ శాఖదేనని గురువారం సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిందని డీఎఫ్‌వో వసంత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ భూమిపై హక్కును కోరుతూ 1985లో మహ్మద్ అబ్దుల్ ఖాసీం కోర్టులో కేసు వేయగా రెండు సార్లు అటవీ శాఖకు అనుకూలంగా తీర్పు వచ్చింది. దీనిపై ఖాసీం హైకోర్టులో రివ్యూ పిటిషన్ వేయగా ఆయనకు అనుకూలంగా రావడంతో అటవీశాఖ మే 2021లో సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేసింది. దీనిపై వాదనలు విన్న ఇద్దరు జడ్జిల ధర్మాసనం ఆ భూమి అటవీ శాఖకు చెందుతుందని తీర్పు ఇచ్చిందని తెలిపారు. ప్రైవేట్ వ్యక్తులకు అనుకూలంగా అఫిడవిట్లను దాఖలు చేసిన అధికారులపై ఎంక్వైరీ చేసి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరిందని ఆమె పేర్కొన్నారు.